అడుగంటిన భూగర్భ జలాలు

- ఎండిపోతున్న వరి పంటలు
- పశువులను మేపుతున్న అన్నదాతలు
- అప్పుల ఊబిలో కూరుకుపోతామని ఆవేదన


దుప్పల్లిలో బోరు బావి ఎండిపోవడంతో వేసుకున్న పంటను పశువులకు మేపుతున్న దృశ్యం

మదనాపురం: వర్షాకాలంలో సరైన వర్షాలు కురవక పోవడంతో యాసంగి సాగు కత్తి మీద సాములా తయారైంది. చివరి రెండు, మూడేళ్లు వర్షాలు సాధారణంగా పడడంతో ఇప్పటికిప్పుడు నీటి కష్టాలు రావని భావించిన అన్నదాతలు యాసంగిలో వరిని ఎక్కువగా సాగు చేశారు. వర్షాలు కురవకపోడం, బోర్ల ద్వారా నీటిని నిరంతరం తోడుతుండడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో అన్నదాతలు కంటికి రెప్పలా కాపాడుకుంటున్న వరి పంటలు ఎండిపోతున్నాయి.

ఇబ్బడి ముబ్బడిగా బోర్ల డ్రిల్లింగ్

మండలంలోని నరసింగాపురం, నెల్విడి, కొన్నూరు, దంతనూరు, శంకరమ్మపేట, గోవిందహళ్లి, మదనాపురం, తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు శరవేగంగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో నెల రోజులు నీరందితే పంట కోతకు వస్తుందని భావిస్తున్న రైతులు ఎలాగైనా పంటను దక్కించుకోవాలని రూ.వేలు ఖర్చు చేసి బోర్లు తవ్విస్తున్నారు. అయినా ఆశించిన ఫలితం దక్కకపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి అయినా వస్తే బాగుండని, వేసిన పంటలో కొంతైనా కాపాడుకోవాలని రాత్రింబవళ్లు పొలాల దగ్గరే ఉండి మడులకు నీటి పారిస్తున్నారు.

పశువులకు మేతగా..

చేతికొచ్చిన పంట కళ్ల ముందే ఎండిపోతుండడంతో చేసేందేమి లేక రైతులు పశువులను మేపుతున్నారు. పొలం దుక్కి దున్నేందుకు, కరిగెట, వరి మొలక నాటుకు, ఎరువులు, పురుగు ముందుల పిచికారీ అని రూ.వేలు పెట్టుబడులు పెట్టామని, పంట ఎండిపోతే అప్పులే మిగులుతాయని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కనీసం పంట నష్ట పరిహారం అయినా ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రూ.లక్ష పెట్టుబడి పెట్టాను



నా ఎకరం పొలంతో పాటు మా అన్నదమ్ము లం కలిసి ఐదు ఎకరాలు సాగు చేసాం. ఇప్పటికే రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాం. మా కష్టం వృథాగా పోయింది. బోరు బావిలో నీరు తగ్గడంతో ఏమి చేయలేని దుస్థితి. చేసేందేం లేక కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను పశువులకుమేపుతున్నాం. మాకు అన్నం పెడుతది అనుకున్న పంట కళ్ల ఎదుట ఎండిపోవడం బాధ కలిగిస్తుంది. ప్రభుత్వం స్పందించి మమ్ముల్ని ఆర్థికంగా ఆదుకోవాలి.

– చిన్నయ్య, రైతు, దుప్పల్లి

క్లుప్తంగా

అయోధ్య ప్రసాదం పంపిణీ



పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి ఆలయం వద్ద శనివారం అయోధ్య ప్రసాదాన్ని బీజేపీ నాయకులు గ్రామస్తులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు అయోధ్య వెళ్లి రామయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి తీసుకొచ్చిన ప్రసాదాన్ని గ్రామస్తులకు పంపిణీ చేసినట్లు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముంత వెంకటేష్‌యాదవ్, ముంత రాముడు, ముంత రాజు, రంగస్వామి, రవీందర్, నరసింహాస్వామి, భాను, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలను తొలగించండి



వీపనగండ్ల: బీమా ప్రధాన కాల్వలో కంపతార చెట్లు, జమ్ము ఏపుగా పెరగడంతో సాగు సమయంలో చివరి ఆయకట్టుకు నీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతాయని, అధికారులు స్పందించి వీటిని తొలగించాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. పుల్గర్‌చర్ల, కల్వరాల, వీపనగండ్ల, సంగినేనిపల్లి తదితర గ్రామాల్లోని భీమా కెనాల్‌లో జమ్మును తొలగించేందుకు ఉపాధి కూలీలను వినియోగించి, వారికి ఉపాధి కల్పించాలన్నారు. వేసవిలో కంపతార చెట్ల తొలగింపు సులభం అవుతుందని, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి పనులు ప్రారంభించాలని వేడుకుంటున్నారు.

కల్వర్టుకు మరమ్మతులు కరువు



వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి గోవర్ధనగిరి గ్రామానికి దాదాపు రూ.8 కోట్లతో డబుల్ బీటీ రోడ్డును నిర్మించిన అధికారులు గోపల్‌దిన్నె క్రాస్‌రోడ్డు సమీపంలో ప్రమాదబరితంగా ఉన్న కల్వర్టు నిర్మాణం చేపట్టలేదని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. గోవర్ధనగిరి కత్వగా పిలువబడే ఈ కల్వర్టులో పైపులను నిల్వ ఉంచడం వల్ల రాత్రివేళలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అదుపుతప్పిన కారు



పాన్‌గల్: కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లాపూర్ నుంచి వనపర్తి వెళ్తున్న కారు అన్నారంతండా సమీపంలో మలుపు వద్ద చెట్టును ఢీకొని పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతగా నిర్మించాలి


సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ రమణ

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించాలని పీఆర్ ఏఈ రమణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యతగా నిర్మిస్తూ వాటర్ క్యూరింగ్ తప్పక చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లింపులను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, బండపల్లి ఎంపీటీసీ ప్రేమ్‌కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు బ్రహ్మయ్య, నిరంజన్‌యాదవ్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై అవగాహన


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రామయ్య

పాన్‌గల్: ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై నిర్వహించే ఇంటింటి సర్వేపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కుష్ఠు వ్యాధి మచ్చలు, సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా రాగిది రంగు కలిగి ఉంటుందని, మచ్చపై స్పర్శ ఉండదని, ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి ఆస్పత్రికి తరలించాలన్నారు. 1 నుంచి 5 మచ్చలున్న వారికి 6 నెలలు, 6 కన్నా ఎక్కువ మచ్చలున్న వారికి 12 నెలలు కాలం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స ఉంటుందని తెలిపారు.

రేమద్దులలో బండలాగుడు పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కేతూరి వెంకటేష్

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో మహా శివరాత్రి సందర్భంగా హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను శనివారం ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. పోటీలకు మొత్తం ఆరు జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.60 వేలు నగదును రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ద్వితీయ బహుమతి రూ. 50 వేలు గ్రామానికి చెందిన గోకం రఘు, తృతీయ బహుమతి రూ.40 వేలు నగదును డా.కేతూరి వెంకటేష్ ప్రకటించారు. విజేతలుగా నిలిచిన జట్లకు కాంగ్రెస్ నాయకులు, నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

గుంతలమయంగా బీటీ రోడ్డు



అడ్డాకుల: మూసాపేట మండలం దాసర్‌పల్లి నుంచి చెన్నంపల్లి వరకు బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. దాసర్‌పల్లి నుంచి చెరువు కట్ట మీదుగా చెన్నంపల్లి వరకు చాలా చోట్ల బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. చెరువు కట్టపై ఉన్న గుంతల మూలంగా వాహనాలు అదుపు తప్పితే చెరువులోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నంపల్లి సమీపంలోని మలుపుల వద్ద రోడ్డుపై ఉన్న గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ రోడ్డుపై ప్రతి రోజు ఆటోలు, ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. దాసర్‌పల్లి, చెన్నంపల్లితో పాటు నందిపేట గ్రామానికి రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



పెబ్బేరు రూరల్: కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా శనివారం మండలంలోని వై.శాఖాపూర్ గ్రామాన్ని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి సందర్శించి, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి సీసీ కెమెరాల ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబరు నేరగాళ్లు చేసే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. చిన్న పిల్లలకు మోటారు బైక్‌లు ఇవ్వరాదని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొట్ట బాలచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ యాదవ్, ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా సంయుక్త కోశాధికారిగా జ్యోతి

వనపర్తి: పట్టణ మాజీ కౌన్సిలర్ జ్యోతిని బీజేపీ రాష్ట్రశాఖ మహిళామోర్చా సంయుక్త కోశాధికారిగా నియమించినట్లు రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి శనివారం ప్రకటించారు. గత కొన్నేళ్లుగా బీజేపీకి నిస్వార్థ సేవలందిస్తున్న మాజీ కౌన్సిలర్ సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి పదవి కేటాయించడంపై పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11న లెప్రసీ సర్వే

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం లెప్రసీ సర్వే ఈ నెల 11 నుంచి ప్రారంభం అవుతుందని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు లెప్రసీ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి ఉదయం 6గంటల నుంచి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికి లెప్రసీ గురించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనుమానిత వ్యక్తుల లిస్టును తయారు చేసి ఆరోగ్యకేంద్రానికి పంపుతామన్నారు. డాక్టర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి లెప్రసీని నిర్ధారణ అయితే వారికి ఉచితంగా 6నెలలు మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్యానారాయణ, హెలెన్, చంద్రన్న, తిరుమాల్ రావు, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులను అరికట్టాలి


మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న గిరిజాదేవి

కొత్తకోట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని బలిజపల్లిలో ఐఎన్‌టీయూసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గిరిజాదేవి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో కూడా మహిళలు అణచివేతకు గురవుతున్నారని, వారికి పురుషులతో సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో వారికి అన్ని రకాల వసతులు కల్పించాని కోరారు. మహిళపై వేధింపులు, భ్రూణ హత్యలు, వివక్షను తొలగించేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగు మాధవరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాసులు, సూర్య జానపద అకాడమీ చైర్మన్ సురేందర్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'చల్లా' గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


అమరచింతలో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వంశీచందర్‌రెడ్డిని ప్రకటించడంతో మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ చల్లా వంశీచందర్ రెడ్డిని మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రణాళికతో ముందుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, తౌఫిక్, పోసిరిగారి విష్ణు, తిరుమలేష్, మోహన్, హనుమంతునాయక్, శ్యాం, ప్రకాష్ పాల్గొన్నారు.

జాతర సందర్భంగా బందోబస్తు


పూజారికి సూచనలు చేస్తున్న ఎస్ఐ నరేందర్

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువు మధ్యలో ఉన్న పరమేశ్వరస్వామి ఆలయం వద్ద నీటి ఉధృతి ఉండడంతో ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతున్నామని ఆత్మకూర్ ఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం సాయంత్రం పరమేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ పూజారి కర్పసయ్య, భక్తులకు పలు సూచనలు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు సావధానంగా నీటిలోకి వెళ్లకుండా ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న తులసీరాజ్‌యాదవ్

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మహర్దశ చేకూరనుందని యూత్ కాంగ్రెస్ మక్తల్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసీరాజ్‌యాదవ్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన పాలమూరు ప్రజాదీవెన సభకు రెట్టింపు స్థాయిలో కార్యకర్తలు చల్లా వంశీచందర్‌రెడ్డికి మద్దతు తెలిపాలని కోరారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. మత, జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్‌కు రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్ గల్లంతు ఖాయమని అన్నారు. కార్యక్రమంలో బాల్‌రాజు, శ్యామ్, జహంగీర్, అబ్దుల్లా, రఘు, చిరంజీవి, శేఖర్, రాజు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్ర భవనాలు


పైకప్పు పెచ్చులూడిన వేముల పశువైద్య కేంద్రం

అడ్డాకుల: మూసాపేట, వేముల గ్రామాల్లోని పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. రెండు గ్రామాల్లోని భవనాల పైకప్పు నుంచి తరుచూ పెచ్చులు ఊడి పడుతున్నాయి. మూసాపేటలో వర్షాకాలంలో ఆస్పత్రిలో ఉండి పని చేయడానికి సిబ్బంది భయపడే విధంగా పైకప్పు ఉంది. అయినా సరే ఆస్పత్రిలో పని చేసే సిబ్బంది అందులోనే ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనం లోపల ఉండటానికి వైద్య సిబ్బంది సాహసం చేయాల్సిన పరిస్థితే ఉంది. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరినా పట్టించుకునే వారు కరువయ్యారు. గత వర్షాకాలంలో భవనాన్ని ఖాళీ చేసి యువజన సంఘం భవనంలో ఏర్పాటు చేయాలని భావించినా వీలు కాలేదు. వేముల పశువైద్య కేంద్రం కూడా శిథిలావస్థలో ఉంది. ఇక్కడ కూడా పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. భవనం లోపల గోడలు బీటలు వారాయి. ఇక్కడ మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ విధులు నిర్వహిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి పశువైద్య కేంద్రాలను బాగు చేయించాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మల్లురవికి టికెట్ ఇవ్వాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్‌ను మల్లురవికి ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి వినతిపత్రం అందజేశారు. శనివారం వారు హైదారాబాద్‌లో కలిశారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సందర్భంలో మల్లురవి పార్టీ కోసం పాటుపడ్డారని వివరించారు. ఆయనకు పార్లమెంట్ పరిధిలోని ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయన అయితేనే ఎన్నికల్లో విజయం ఖాయమని వారు తెలియజేశారు. కార్యక్రమంలో జగదీశ్వరుడు, రాముయాదవ్, పరశురాంనాయుడు, కాంతారావు, కృష్ణ, కిరణ్‌కుమార్, భీరయ్యయాదవ్, తదితరులున్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన మల్లురవికి టికెట్ ఇవ్వాలని తెలంగాణ మాలల చైతన్య సమితి నాయకులు మద్దెల రాందాసు, బిజ్జ దేవదాసు, వెంకట్రాములు, సందీప్ కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


ఆత్మకూర్‌లో అన్నదానం

ఆత్మకూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్నకు ఇరుముడులు సమర్పించిన శివదీక్షపరులు శనివారం స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో, చెర్ల పరమేశ్వరస్వామి ఆలయంలో, బీసీ కాలనీలోని శివుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం నమఃశివాయ, శంభో శివశంకర, హరహర మహాదేవ అంటూ భక్తులు శివనామస్మరణతో పూజలు, అభిశేకాలు చేశారు. ఉదయం 5గంటలకు స్వామివారికి జలాభిషేకం, భజన చేసి భక్తులకు ప్రసాదం అందించారు.

18 ఏళ్లుగా భక్తులకు అన్నదానం

మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులకు, 40 రోజుల పాటు నియమనిష్టలతో దీక్షలు చేపట్టిన దీక్షాపరులకు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పిన్నంచర్ల గోవింద స్వామి కుమారులు బంగారు భాస్కర్ విజయలక్ష్మి, ప్రకాష్ పరిమళ, రవి లావణ్య ఆధ్వర్యంలో బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం కొనసాగించడం అభినందనీయమని పూజారులు అన్నారు. కార్యక్రమంలో అక్షరనాగేష్, నరేష్, బాల్‌రాజు, దీక్షేప్రకాష్, శివ, సతీష్, శ్రీధర్, రాజు, పూజారుల కరునాకరయ్య, కర్పసయ్య, భక్తులు పాల్గొన్నారు.

శాగాపూర్‌లో..

పాన్‌గల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని శాగాపూర్‌లోని హన్మదాశ్రమం నందు శుక్రవారం రాత్రి ఓంకారేశ్వర స్వామి, కాశీవిశాలాక్షి దేవత అభిషేకం, కల్యాణ మహోత్సవం, శివ పార్వతుల కల్యాణోత్సవం, శనివారం స్వామి వారి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని గాజుల కోనేరు శివాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. శనివారం ఉదయం శివలింగానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఘంటామఠం జిరిజాశంకర్ అయ్యగారు వేదమంత్రాలతో శివపార్వతులకు కల్యాణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణ మహోత్సవం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయం, పర్వతాపురం శివరామాలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖిల్లాఘనపురంలోని పురవీధుల గుండా శివపార్వతులను ఊరేగించారు. అనంతరం గ్రామంలోని కుర్వగేరి శివాలయం వద్దకు తర్లొచ్చి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. పర్వతాపురంలోని శివరామాలయం వద్ద పచ్చని పందిరి వేసి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం చేశారు.


ఖిల్లాఘనపురంలో..


గోపాల్‌పేటలో శివపార్వతుల కల్యాణం..


ఆత్మకూర్‌లోని శివాలయంలో..

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా శనివారం వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యదర్శికి పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రవి, రంజిత్, రాంబాబు, గ్రామస్తులు ఉన్నారు.